# కథకు మూలం

ఎదురింటి డాబా కేసి చూశాను. ఆ అమ్మాయి .... అలసటగా ఈజీఛేర్‌లో వెనక్కు వాలి, కళ్ళు మూసుకుని వుంది. సుమారు నెలరోజులుగా సాయంత్రం ఐదున్నర, ఆరు గంటల ప్రాంతంలో నేనలా ఆ మేడకేసి చూడటమూ, ఆ అమ్మాయి అలా విశ్రాంతి కోరుతున్న దానిలా అరమోడ్పు కన్నులతో వెనక్కు వాలి వుండటమో, పిట్టగోడ దగ్గర పచార్లు చేస్తుండటమో _ అలవాటుగా జరుగుతున్న పని !

ఈ నెలరోజులలో, ఆ అమ్మాయిని గురించిన వివరాలు చాలా సేకరించ గలిగాను. ఆ అమ్మాయి పేరు సుజాత. వయసు ఇరవై అని చెప్పుకొంటోంది (ట) గానీ, సుమారు ఇరవై ఎనిమిది వుండవచ్చును (ట)! ఎం. ఏ. పాసై లెక్చరరుగా పని చేస్తోంది (ట)! ఈ మధ్యే ఇక్కడి కాలేజికి ట్రాన్స్‌ఫరై వచ్చింది. ఎదురింటి మేడ మీద గది అద్దెకు తీసుకుంది.

తల్లిదండ్రులకు గంపెడంత సంసారం. సుజాతకు యిద్దరన్నలు. వాళ్ళిద్దరూ ఒకడు భిలాయ్‌లోనూ, మరొకడు ఢిల్లీలోనూ సుమారైన ఉద్యోగాలు చేసుకుంటూ, తమ తమ భార్యలతో కులాసాగా కాలం వెళ్ళబుచ్చుకుంటున్నారు తలిదండ్రుల గురించిగానీ. తమ తర్వాత పెళ్ళీడుకు వచ్చిన సుజాతను గురించిగానీ వాళ్ళిద్దరికీ ఏలాటి బెంగా, బాధ్యతాలేవు!

సుజాత తర్వాత ఇద్దరు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లాయిలూ వున్నారు. సుజాత తండ్రి తాలూకా ఆఫీసులో గుమాస్తా! ఆ సంసారపు బరువంతా ప్రస్తుతం సుజాత భుజస్కంధాల మీదే వుంది!

నెలా నెలా వచ్చే జీతంలో చాల కొద్దిగా మాత్రమే తనకుగానూ మిగుల్చుకొని, మిగతాదంతా తండ్రికి పంపే స్తుంది. బట్టలు కూడా చాలా తక్కువ ఖరీదువి ... (ఆ అమ్మాయితో పాటు ఉద్యోగం చేసే వారి బట్టలతో పోల్చి చూస్తే.) కట్టుకుంటుంది. మెడలో ఒకే ఒక నకిలీ ముత్యాల హారం, చెవులకు రింగులూ, (అవి బంగారంవో కావో తెలీదు.) ఓ చేతికి వాచీ, మరోచేతికి బంగారు రంగు రాజస్థాన్ లక్క గాజులూ....

అంత సింపిల్‌గా వున్నా అందంగానే వుంటుంది. నిజానికి ఆఅమ్మాయి వయసు పాతిక లోపే అన్నా నమ్మేంత నవ-నవ లాడే అందం!

నాకిలాటి కన్యలను చూస్తే, ఎంతో జాలి కలుగు తుంటుంది. అటు అన్నల స్వార్థానికీ, ఇటు తోబుట్టువుల - తలి దండ్రుల మీద మమకారానికీ, వీరి జీవితాలు బలై పోతున్నాయనిపిస్తుంది! ఈ మధ్య మరో భావం కూడా నాలో స్థిరంగా పీఠం వేసుక్కూర్చుంది. ఇలా ఉద్యోగి నులుగా మారిన కన్యల కసలు వివాహం అవసరం లేదన్నట్లు నిర్లిప్తంగా వుండిపోతారు తలిదండ్రులు. తమ మిగతా పిల్లల అభివృద్ధి కాంక్షిస్తారే తప్ప, ఈ కన్య సరేసరి! తమకు,

తమ తల్లి దండ్రుల – తోబుట్టువుల బెడద వదిలింది; అంతే వాలనుకుంటారు .... ఇక ఈ కన్యల స్వార్థ త్యాగం .... జీవితాలు — కత్తిరింపబడిన క్రోటన్ మొక్కలులా, పుష్పించని చెట్లలో మిగిలి పోవలసిందేనా ?

మరీ సుజాతనలా చూస్తున్న కొద్దీ నాలో పైరకం భావాలు మరింతగా ఉక్కిరి బిక్కిరి చేయసాగాయి అనుకోకుండా ఆ అమ్మాయి మీద జాలి . ఉప్పెనలా పొంగసాగింది. అన్నిటి కంటే భరించలేక పోతున్న విషయం – ఈ వీధిలోని అమ్మలక్కల-కొందరు మగధీరుల వాలకం!

నాకు ఆ అమ్మాయిని గురించిన వివరాలన్నీ మొదటి వారంలోనే చెప్పిన అనసూయ, మరువారం నుంచే—

"మీరైనా చెప్పండి లలితా! ఇలాటి అందమైన-వయసులో వున్న అమ్మాయిలు - ఉద్యోగాల పేరుతో ఊళ్ళమీద పడటం బాగా లేదు! ఎడంపాపిడీతీసి నుదురు సగం మూసుకు పోయేలా బోడిగా దువ్వి, ఆ జడేమిటి? ముప్ఫై ఏళ్ళు రాబోతుంటే ... పెళ్ళి కాలేదు గానీ, అయ్యుంటే ఆరుగురు పిల్లల తల్లి అయ్యుండేది కాదూ?" అనటం మొదలెట్టింది.

నాకు ఒళ్ళు మండింది. ఈ అనసూయ అస్తమానం సుజాత వెంటా - వెనకా తిరిగి ఐదూ - పదీ అప్పుగా తీసుకొంటోందని తెలిసింది.

"ఏమిటో - ఈవిడ డాబా మీద చేరాక, మా శ్రీవారు క్లబ్బుకు వెళ్ళటం చాలించేశారు! అస్తమానూ

మా డాబా మీదే పచార్లు చేస్తున్నారు! అదేమంటే చల్ల గాలికోసం అంటారు! కాకుంటే ఇలాటి అమ్మాయిల తలి దండ్రులకు - ఇదో తమాషా అయిపోయింది. ఆడపిల్ల తన అందం ఎరతో, కట్నం లేకుండా ఎవణ్ణో ఒకణ్ణి ఎన్నుకుం టుంది లెమ్మని... వదిలేసి వూరుకుంటారు! లేకుంటే, ఆ పిల్లని ఒకర్తెనీ ఇలా పరాయి వూళ్ళో అట్టే పెడతారా?" అంటూ, తన శ్రీవారి దుర్బుద్ధిని సమర్థించుకోవటానికి ప్రయ త్నిస్తోంది పక్కింటి సరోజ....

నా కవన్నీ వింటూంటే - చూస్తుంటే, సుజాతపట్ల అపరిమితమైన జాలీ, స్నేహభావం కలగసాగాయి. అందుకే మెల్లిగా పరిచయం చేసుకున్నాను.

రెండోనెల తిరిగేసరికి, సుజాత నాకు బాగా చేరిక అయ్యింది. కాలేజి నుంచి రాగానే, ఒక్కోరోజు సరాసరి నా దగ్గరకు వచ్చేస్తుంది. బాబుకూ, పాపకూ చాక్లెట్లు తెస్తుంది. వాళ్ళిద్దరితో ఆడుకుంటుంది చిన్నపిల్లలా! కాలేజి కబుర్లు చెబుతుంది. ఏ పండగో ప్రత్యేకతో వుంటే, నేనే భోజనం చెయ్యమని బలవంతం చేస్తాను. చేస్తుంది....

"మీరు చాలా అదృష్టవంతులు అక్కయ్యా!" అందో సారి సుజాత.

"ఏం?" అన్నాను నవ్వుతూ.

"బావగారు, శేఖర్‌గారు .... చాలా అపురూపంగా చూచుకుంటారు మిమ్మల్ని! భర్త భార్యకి ఎంత గౌరవం

ఇవ్వాలో, ఎంత అభిమానంతో - అనురాగంతో చూడుకో వాలో .... అలాగే భార్య భర్తని ఎలా అభిమానించి తన చల్లని చిరునవ్వుతో, మంచిమాటలతో సేద దీర్చాగలదో .... మీ దాంపత్యంలో చూస్తున్నాను. నేను, ఇద్దరికిద్దరూ అదృష్ట వంతులు. ముచ్చటైన దాంపత్యం ....రత్నాల్లాంటి పిల్లలు.... నా కిక్కడున్నంత సేపూ గంటు ఒక నిముషంలా గడచి పోతూంది. మీలాటి సంస్కారం హృదయుల స్నేహం దొరికి నందుకు నాకెంతో సంతోషంగా వుంది. ఆమాటే వ్రాశాను మొన్న, మా నాన్నకు ఉత్తరం వ్రాస్తూ!"

నాకు గర్వంతోబాటు ఓ ఆశకూడ మొదలైంది. ఇందాకా సుజాతతో ఎంతో చనువుగా మాట్లాడినా, ఆ అమ్మాయి వివాహాన్ని గురించి చెప్పగల ధైర్యం రాలేదు. సుజాత మాటలతో, నా కా ధైర్యం వచ్చింది ....

"... పోనీ నువ్వూ అలాటి అదృష్టవంతురాలిలా మారరాదూ సుజాతా !...." అన్నాను నవ్వుతూ.

"అదెలా సాధ్యం అక్కయ్యా !" అంది సుజాత.

"పెళ్ళి చేసుకుంటే సరి !"

సుజాత క్షణకాలం తల వంచుకుంది. తర్వాత మెల్లిగా అంది, "నా తర్వాత ఇద్దరు తమ్ముళ్ళూ, ఇద్దరు చెల్లా యిలూ...."

"....వున్నారు_నాకు తెలుసు. కానీ వాళ్ళంతా నీ అంత అయ్యేసరికి-నీకిక పెళ్ళి అవసరం వుండదు. పైగా నీ ఈ స్వార్థ త్యాగానికి అర్థం లేదు. ఇదో విధంగా మీ తలి

దంపుడుల బాధ్యతారాహిత్యం కూడాను....నీ భవిష్యత్తును గురించి నువ్వాలోచించుకో ఒక్కసారి!'' అన్నాను ఆవేశంగా,

సుజాత చిరునవ్వునవ్వింది. "మీరేదో ఎమోషనల్‌గా వున్నారీ రోజు!" అంటూ ఆ సంభాషణ ఆపేసింది.

ఇక అది మొదలు - సుజాతతో మాట్లాడే ప్రతి పది మాటలలో ఒక మాట ఆ పిల్ల పెళ్ళికి సంబంధించిందిగానే మారింది నాకు.

''లోక నింద....మగాళ్ళ వంకర చూపులు-నీ మీద ప్రసరింపబడకుండా వుండాలంటే....'' అంటూ మొదలెట్టానో లేదో సుజాత నవ్వింది ''కొంపదీసి మీకూ నామీద దురభిప్రాయం లేదు కదా? మీ ఇంటికి వస్తుంటే - బావగారిని గురించి భయం లేదు కదా?'' అంది నా వేపు సూటిగా చూస్తూ

నాకు అవమానకరంగా తోచాయి ఆ మాటలు...

''మీ బావగారిని గురించి నాకెలాటి భయమూ లేదు సుజాతా! ఆయనగారు అందరు మగాళ్ళలాటివారు కారు!'' అన్నాను రోషంగా.

''శ్రీరామచంద్రులా?" కొంటెగా నవ్వుతూ అంది సుజాత.

''కాదు.''

''శ్రీరామచంద్రుడు, పక్కన పర్ణశాలలో సీతమ్మ వుండనీ, శూర్పణఖతో తనే మాత్రం వెర్రి వేషాలు పడినా,

సీతమ్మ పసి కడుతుందనీ, లక్ష్మణుడి ముందు తన పరువు కడిగేస్తుందనీ భయపడి వుంటాడేమో! ఆ తర్వాత ఆయనకు ఎల్లవేళలా ఎస్కార్ట్సు లక్ష్మణుడు, సుగ్రీవుడు, అంజనేయుడు. ఇలా సవాలక్షమంది వుండనే వుండిరి. ఉత్తర రామాయణం జరిగే నాటికి— ఆయనగారికి రొమాంటిక్ లైఫ్ మొహం మొత్తేసి వుంటుంది రాజ్యభారమూ, బాధ్యతలూ వుండి వుంటాయి.

కానీ మా శ్రీవారలాక్కాదు. ఏకపత్నీవ్రతులంటే ... వ్రతులే! అంచేత నా కెలాటి భయాలూ, ఎవరి గురించీలేవు. ఎటోచ్చీ - నీమేలుకోరి చెబుతున్నాను. మీవాళ్ళెలాగూ నీకు పెళ్ళిచెయ్యరు''

నా ఈ ఉపన్యాసాలతో సుజాతలో మార్పు వస్తోందని పించింది నాకు. నా సలహా మీద పోయిన నెలలో ఓ జత బంగారు గాజులు కొనుక్కుంది. మరో రెండు నెలల్లో ఒంటి పేట చెయిన్ కొనుక్కుంటానంటోంది ఇక త్వరలో పెళ్ళి కూడా చేసుకొంటుంది! నాకెందుకో - పరిస్థితుల ప్రాబల్యంతో బలి అయిపోతున్న ఓ కన్యజీవితం నా సహవాసంతో ఉద్ధరింపబడుతోందన్న సంతోషం ఎక్కువై పోతోంది!

"పాపం - సుజాతకింకా పెళ్ళి కాలేదు!" అన్నాను శ్రీవారితో ఆ రోజు; డాబా మీద ఈజీఛేర్‌లో వాలి సిగరెట్ తాగుతున్నారు.

"అయితే నీకు బాధెందుకు మధ్య? అన్నారు నవ్వుతూ.

ఈ మధ్య మీసకట్టు మార్చారు. చాలా సన్నగా

కత్తిరించారు. ఏదో కొత్త అందం వచ్చిందనిపిస్తోంది వారిలో.

'....సాటి ఆడది....ఆమె జీవితం క్రోటన్ మొక్కలా వసంతం రాని-లేని వనంలా, ఫలించని వృక్షంలా....''

"స్టాప్ ...ఫుల్‌స్టాప్.... ఏదైనా సీరియల్, సీరియస్‌గా చదువుతున్నావా !"

"మీకు వేళాకోళంగానే వుంటుంది. నా మటుకు నాకు ఇలాటి అమ్మాయిలను చూస్తుంటే గుండె చెరువౌతోంది! ఈ దేశం ఎప్పుడు బాగుపడుతుంది."

"సుజాతకు పెళ్లి అయితే కాబోలు !"

" .... వెక్కిరింపు ధోరణి వదలి పెట్టండి .... మీరు సీరియస్‌గా ట్రై చెయ్యండి.... మీ ఫ్రెండ్స్‌లో ఎవరైనా, కాస్త మాంఛి ఉద్యోగమూ సుమారైన అందమూ వుండే వాడిగా.... బ్రహ్మచారి వుంటే చూద్దాం .... ఓ పెళ్లి కుదిర్చిన పుణ్యం దక్కుతుంది కూడాను!"

".... ఇంతకు సుజాత కసలు పెళ్ళి చేసుకోవాలని వుందో.... లేదో.... నీకు తెలుసా ?'' అన్నారు ఆలోచిస్తూ.

"ఇది మరీ బావుంది తలిదండ్రులు పట్టించుకోకా- అన్నల ఆలనా-పాలనా లేకా తనంత తానుగా బయట పడలేకా-సంసారపు వూబిలోనుంచి బయటకు రాలేకా .... అలా వుందిగానీ- సుజాత కిష్టం లేకపోవట మేమిటి? అందాకా ఎందుకూ ? ఎన్నోసార్లు మన దాంపత్యం తన కెంతో నచ్చిందంటూ కబుర్లు చెబుతుంటుంది!"

"ఈ విషయంలో సుజాతతో స్వయంగా మాట్లాడి గానీ, ఆ అమ్మాయి అభిప్రాయాలూ, ఆలోచనలూ, బాగా పరిశీలించనిదే.... నేనో నిర్ణయానికి రాలేను లలితా !" అన్నారు.

"ఆల్‌రైట్ ! అలాగే కానీండి..." అన్నాను. నాకు తెలుసు, శ్రీవారు నా మాట సబబేనని ఒప్పుకుంటారని. ఆరోజునుంచీ, శ్రీవారు, సమయం చిక్కినప్పుడల్లా సుజాత, నా సంభాషణల్లో పాల్గొంటున్నారు. పెళ్లిని గురించి సుజాతను రకరకాల ప్రశ్నలూ వేస్తున్నారు మొదటిలో సుజాత కాస్త సంకోచించేది, జవాబులు చెప్పటానికి.... రాను రాను ఆబెరుకు తగ్గి ఉత్సాహంగా సరయిన జవాబులు చెబుతోంది...

"ఇంతకూ మీ అక్కయ్య సెలెక్టుచేస్తే చాలన్న మాట వరుణ్ణి ?" అన్నారు శ్రీవారు నవ్వుతూ, సుజాతతో పది రోజుల క్రితం.

"ఆహా ! అక్కయ్య మనస్పూర్తిగా ఒప్పుకుంటే చాలు !" అంది సుజాతకూడా నవ్వుతూ.

నాకు కొండంతబలం వచ్చింది. "విన్నారా ?"అన్నట్లు చూశాను శ్రీవారి వేపు....

♦ ♦ ♦ ♦

మా చినమామగారి కొడుకు, గోపాల్ ఉద్యోగరీత్యా ఇక్కడి కొచ్చాడు. మెడికల్ రిప్రజెంటేటివుగా పని చేస్తు

న్నాడు. వయసు ముప్ఫైలోపే. తనజాబ్ పర్మినెంట్ అయ్యే వరకూ పెళ్ళి చేసుకోనని భీష్మించుకున్న అభినవ భీష్ముడు! అతగాడికి కంపెనీ పనిమీద సుమారు రెండు నెలలు ఇక్కడే ఉండాలని తెలిసింది .... వేరే రూం చూసుకుంటానని గొడవ చేశాడు గానీ, ఒప్పుకోలేదు మే మిద్దరం .... అతగాడు వచ్చాక.... నా బుర్రలో .... సుజాతకు సరైన జోడీ అన్న భావం పెరిగి పెద్దది కాసాగింది.... నా అంత నేనుగా బయట పడటం ఇష్టంలేక....శ్రీవారితో నా ఆలోచన చెప్పాను....

"వెనకటికి కుక్క చేసేపని, గాడిద చేసి .... తన్నులు తిన్నదట .... ఆ అమ్మాయికి అమ్మా, నాన్నా, అన్నలూ వున్నారు. వీడికీ వున్నారు....ఈ పెళ్ళిళ్ళ పేరమ్మ పెత్తనం నీ కెందుకు?" అన్నారు చిరాగ్గా!

మగాళ్ళంతా ఇంతే! తమ మనసుకు నచ్చితే, నెత్తిన వేసుకచేస్తారు ఎంత కష్టమైన పని అయినా. లేకుంటే లేదు.

గోపాలం కూడా మాలో ఒకడిగా కలిసిపోయాడు. సుజాతతోనూ స్నేహంగా మాట్లాడుతున్నాడు....

శ్రీవారు, నేనూ, సుజాత, గోపాలం గంటల తరబడి కారెమ్స్ ఆడుతున్నాము. నాకు సరిగ్గా చేతరాకున్నా పేకాట ఆడుతున్నాం....

వారంరోజుల్లో సుజాత శలవులకు వెళుతుంది. ఈ వారంలోనే గోపాలం వెళ్ళిపోతాడు....ఆ రోజు సుజాతతో మెల్లిగా అన్నాను....

"మా గోపాలం గురించి నీ అభిప్రాయ మేమిటి?"

"మంచివాడు..."

"అందగాడు కాడూ ?"

'అందం సంగతి నాకేం తెలుసు అక్కయ్యా? అసలలాటి విషయాలలో .... మీలాటి గృహిణులకే చాలా విషయాలు తెలిసివుంటాయి ... పోనీ నువ్వు చెప్పు శేఖర్ బావగారి అందానికి .... పర్సనాలిటీ ముఖ్యమో .... మొహంలో అందమో.... నాకింతవరకూ తెలీలేదు !"

ఆ అమ్మాయి అమాయకత్వానికి ఫక్కున నవ్వొచ్చింది ... "మీ బావగారి గుంటకళ్ళు .... అందంగా వుంటాయి ... సన్నని మీసకట్టు బావుంటుంది .... నవ్వితే కళ్ళు మూసుకుపోతే, అదో రకమైన అందం పర్సనాలిటీ కూడా బావుందనుకో .... గోపాలాన్ని, మీ బావగారితో పోల్చకుండా చూస్తే.... అందగాడే .... ఏమంటావు?"

"అవును...."

"నువ్వెలాగూ శలవులకు వెళ్తున్నావు ... మీ అమ్మ, నాన్న గార్లతో ఈ సంబంధం విషయం చెప్పు. వాళ్ళు ఒప్పుకుంటారా సరే లేకుంటే, ధైర్యంగా రిజిస్టర్ మారేజ్ చేసుకో.... నేనూ మీ బావగారు దీవిస్తాం .... చాలు....అంతే గానీ .... మీ వాళ్ళ స్వార్థానికి బలికావొద్దు .... క్రోటన్ మొక్కలా .... వసంతం రాని ... లేని వనంలా ... ఫలించని వృక్షంలా...."

సుజాత నవ్వి వెళ్ళిపోయింది....

ఆ రోజే గోపాలన్ని కదిలించాను...

"సుజాత గురించి నీ అభిప్రాయ మేమిటి గోపాలం?"

"ఏముందీ? మంచి అమ్మాయి ఉద్యోగినికి వుండ వలసిన ఠీవి, దర్పంకంటే, ఎక్కువగా స్నేహశీలత; వాక్చాతుర్యము వున్న అమ్మాయి."

"ఓమాట చెబుతాను... ఏమీ అనుకోవు కదా!" అన్నాను అసలు విషయానికి వస్తూ.

" నా మేలుకోరే వదినవు! మంచిగాక చెడు చెబుతావటమ్మా! తప్పక చెప్పు..." అన్నాడు గోపాలం వినయంగా వెయ్యి ఏనుగుల బలం వచ్చింది నాకు.

"నీకూ ముప్పై ఏళ్లు రాబోతున్నాయి. గోపాలం.. ఇంకా పెళ్ళి చేసుకోకపోవటము ఏం బావుంది? చెప్పు? ఉద్యోగం పర్మినెంట్ అయింది కూడాను.... ఇంకా ఆలస్యం దేనికి?"

గోపాలం క్షణకాలం నావేపు ఇబ్బందిగా చూచి, తల దించుకొని మెల్లిగా అన్నాడు.....

"నీకు మా కుటుంబ విషయాలు తెలియనివి గావు ఒదినా! నాతర్వాత ఇద్దరు చెల్లాయిలు, పెళ్ళి గావలసి వున్నారు. వాళ్ళకి చెయ్యకుండా .... నేను ....

"వాళ్ళకి తప్పక త్వరలోనే చేద్దువుగానీ .... కానీ ముందు నీ పెళ్లి కానీ .... లక్షణంగా ఉద్యోగం చేస్తున్న

పిల్ల.... నెలకు సుమారు ఐదువందలు తెస్తున్న బంగారు బాతు! కట్నం లెక్క వేసుకున్నా .... ఇంతకంటే ఎక్కువ వస్తుందేమో లెక్క వేసుకో .... సంవత్సరానికి ఆరువేలు. ఒక్క ఏడాది ఆ అమ్మాయి జీతం అవళంగా బ్యాంక్‌లో వేశావంటే, నీ చెల్లాయి కొక్కర్తెకు పెళ్ళి అయిపోయినట్టే! అందమూ వుంది ... అణకువా వుంది ... ఏమంటావ్''

గోపాలం ఐదారు నిముషాలు మౌనంగా కూర్చొని తర్వాత మెల్లిగా లేస్తూ అన్నాడు .... ''నే వెళ్ళాక ఉత్తరం వ్రాస్తా నొదినా!'

'అలాగే! మీ అమ్మా నాన్నా కాదనరనుకుంటాను!" అన్నాను హుషారుగా వంటింటికేసి వస్తూ.

అదే రోజు .... సుజాత వాళ్ళ వూరికి వెళ్ళింది. వెళ్ళే ముందు మరీమరీ చెప్పాను .... తప్పక ఈసారి పెళ్ళికి సిద్ధమయ్యి రావాలని .. గోపాలమూ వెళ్ళిపోయాడు. వెళ్ళే ముందు...మరోమారు హెచ్చరించాను. 'చక్కటి సంబంధం . బాగా ఆలోచించుకో''మని ....

ఎవరో ఫ్రెండ్‌కు వీడ్కోలివ్వటానికి స్టేషన్‌కు వెళ్ళారు శ్రీవారు అదే ట్రెయిన్‌లో సుజాతకూడా వెళ్ళిందట ....

ఆ రోజంతా శ్రీవారు పరధ్యానంగా వున్నారు....

"నువ్వు అమాయకురాలివి లలితా! ఇప్పుడా అమ్మాయి పెళ్ళి గురించి నీకు బాధ్యతెందుకు?" అన్నారు రెండు మూడుమార్లు.

నేను నవ్వి వూరుకున్నాను.

♦ ♦ ♦

పదిరోజులు జరిగిపోయాయి. సుజాత రాలేదు, కాలేజి మొదలైనా,....

"ప్చ్! పెళ్ళి పెళ్ళి అని తరిమావు! ఆ అమ్మాయి హడలి పోయుంటుంది, ఎక్కడ పెళ్లిచేసేస్తావో నువ్వని....శలవుపెట్టి. ట్రాన్స్ఫర్ చేయించుకుంటుందో ఏమో? బొత్తిగా ఇల్లు బోసి పోయినట్లుంది .... అలవాటుగావస్తూండేదా? సరదాగా వుండేది పాపం." అంటూ బాధ పడ్తున్నారు శ్రీవారు

"ఏకంగా పెళ్ళి కబురుతో వస్తుందిలెండి!" అంటు న్నానో లేదో, 'పోస్ట్!' అన్న కేకా. రెండు కవర్లూ వచ్చే శాయి. ఆత్రంగా తీసుకున్నాను.

ఫ్రమ్ అడ్రస్‌లు చూశాను. గోపాలం దగ్గర్నుంచి ఒకటీ. రెండోది సుజాత దగ్గర్నుంచి.

మొదట గోపాలం ఉత్తరం పైకి తీశాను.

ప్రియమైన వదినకు,

నమస్కారం. నేనున్న రెండు నెలలూ, కన్న తల్లిలా నన్ను ఆదరించినందుకు _ నా మనఃపూర్వకమైన కృతజ్ఞతాభి వందనములు.

(పిచ్చి పిల్లాడు!)

"....నా వివాహ విషయంలోకూడా మీరు కనపరచిన ప్రత్యేక శ్రద్ధా, అభిమానమూ నేనెన్నడూ మరువలేను.

"కానీ ఈ విషయంలో మీకు నిరాశ కలిగిస్తున్నందుకు క్షమించ గోరతాను.

"సుజాతలో మీరు చెప్పినట్లు ఏ లోపం లేదు. డబ్బు వేపు ఆలోచించినా మీరు చెప్పిన ఆలోచన సబబుగానేవుంది.

"కానీ నాకెందుకో, ఉద్యోగం చేసే అమ్మాయిని పెళ్ళాడాలంటే భయం .... ఇది కేవలం నా బలహీనత ! నాలానే ఆ అమ్మాయికీ పుట్టింటి వేపు వారి బాధ్యత లుంటాయి; భర్తననే అహంతో, ఆమె డబ్బు నా కుటుంబ బాధ్యతలకోసం వాడుకోవటం నాకు నచ్చదు.

"పదుగురిలో మెలుగుతూ, ఉద్యోగం చేయాల్సిన స్త్రీ, కులాసాగా నలుగురి తోనూ కలిసి-మెలిసి వుండక తప్పదు. అది అరికట్టడం అమానుషం....

"మొన్నను శేఖర్ అన్నయ్యతో ఆమె కబుర్లు చెబు తుంటేనే, నేను సహించలేక పోయాను. అలాంటిది నా భార్యగా మారాక ఉద్యోగం చేయటం నే సహించ గలనా ? ఊహుఁ, ఆ విషయంలో నేను కుసంస్కారినని మీరన్నా, నేనేమీ బాధ పడను. నిజమే !

"మొన్ననే ఇక్కడికి దగ్గర్లో వున్న ఓ పల్లెటూరి మోతుబరి రైతు, తమ ఒక్కగానొక్క కూతురిని నాకిస్తా మని వచ్చాడు. పిల్ల బావుంది. కాని సెకెండు ఫారం వరకే చదివించి, చదువు ఆపించేశారు. పిల్లలకు పెట్టే ఇరవై తులాల బంగారం కాక, పిల్ల పేరిట రెండెకరాల భూమీ, అల్లుడికి

కట్నంగా పదిహేను వేలరూపాయల రొఖమూ ఇస్తా మన్నారు..పిల్ల చదువుకోలేదు కాబట్టే-వాళ్ళంత గాప్రాధేయ పడ్తున్నారని తెలిసింది. అమ్మా నాన్నగారి మాటలావుంచి - నాకే నచ్చిందీ సంబంధం. నాకు ఇంటి పట్టున వుండి - నా వేళకు అన్నీ అమర్చే ఇల్లాలు కావాలి....

అందుకే ఆ సంబంధం స్థిరపరచమని చెప్పాను నాన్న గారితో, ఇందులో ఎలాటి త్యాగమూ లేదు. నావాళ్ళ కోసం బలికావటమూ కాదు. మనస్ఫూర్తిగా అంగీక రించాను. నేను ప్రాక్టికల్ మనిషిని. ఉద్యోగం పర్మినెంట్ అయ్యేవరకూ పెళ్ళాడ కూడదని నిర్ణయించుకున్నట్లే - నా కంటె అన్ని విషయాలలో కాస్త తక్కువగా వుండే స్త్రీ వల్లే నేను సుఖపడగలననే నమ్మకం కలవాణ్ణి.

చెల్లాయి లిద్దరికీ సంబంధాలు చూస్తున్నాము. తగిన మనువులు కుదరగానే, నా కట్నం డబ్బుతో వాళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళుచేసి, అదే ముహూర్తంలో నేనూ చేసుకుంటాను. పెళ్ళిళ్ళకు మీరు తప్పక రావాలి. నిరాశ పరిచినందుకు క్షంతవ్యుణ్ణి...

మరిది

గోపాలం''

తల గిర్రున తిరిగినట్లైంది.

''మూర్ఖుడు !'' అన్నాను కసిగా.

''ఎవరు ? ''

"మీ తమ్ముడు....జాబు చదువుకోండి. సిరిరా మోకా లడ్డేడకు ఇలాటివాడే ఎవడో! ఇతగాడి తత్వం తెలీక — పాపం సుజాతకు లేనిపోని ఆశలు కల్పించేను. ఏం వ్రాసిందో ఏమిటో...'' కోపంతో బాధతో శ్రీవారి వేపు గోపాలం ఉత్తరం గిరవాటేసి, సుజాత వ్రాసిన కవరు గబగబా చింపి, ఉత్తరం పైకి తీశాను.

ప్రియమైన లలితక్కయ్యకు !

"నమస్కారం గత పది నెలలుగ మీతో నేను గడిపిన ప్రతి క్షణం ఓ మధురమైన జ్ఞాపకంగా కలకాలం గుర్తుంచుకుంటాను."

"నిజంగా మీలాటి అమాయకులు — దేవుడు మిమ్మల్ని ఎల్ల వేళలా రక్షించాలి."

"నా వివాహ విషయంలో మీరు చూపిన శ్రద్ధకు నా మనఃపూర్వక కృతజ్ఞతలు....కానీ ఇంకా మిమ్మల్ని మభ్య పెట్టడం నాకిష్టం లేదు."

"నా వివాహ విషయంలో నా తలిదండ్రులకుగానీ, నా అన్నలకుగానీ ఏలాటిబాధ్యతా లేనిమాట నిజమే! అయితే, నేనెప్పుడు వివాహం చేసుకున్నా - వారి కేలాటి అభ్యంతరమూ కూడా లేదు.... నాకై నేనే, ఈ బాధ్యతల్ని స్వీకరించాను" కారణం నా తమ్ముళ్లు, నా చెల్లాయిలు, తలిదండ్రులు....వాళ్ళెవరు ? నాకు ఊపిరి పోసినవారూ, నాకు రూపం కల్పించినవారు, నాకు విద్యాబుద్ధులు నేర్పిన వారూ

కారా ? ఈనాడు మా అన్నల స్వార్థమనండి, మరేదేనా అనండి - ఆర్థికంగా తగ్గు స్థితిలో వున్న నా తలిదండ్రుల్ని ఆదుకొనే బాధ్యత ఆడపిల్లగా కాదు, ఒక బిడ్డగా నాకు లేదా ? నా తమ్ముళ్ళు, చెల్లాయిలు, రెక్కలురాని పక్షులు - కాస్త చేయి అందించటం మనిషిగా నా కర్తవ్యం కాదా?

"క్రోటన్ మొక్కలా....వసంతంరాని లేని వనంలా.... ఫలించని వృక్షంలా .... అంటూ మీరు తరచు నా గురించి జాలిపడటం నాకు తెలుసు. అలా నా కనిపించటంలేదు. చక్కగా సంపాదించుకుంటున్నాను. నా వారికి సాయం చేస్తు న్నాను. నాలానే, నాతర్వాత వారూ - మనుషులుగా నిల బడటానికి మార్గం వేస్తున్నాను....ఎందరో పురుషులు నన్ను చూచి మూర్ఛపోవటం నాకు తెలుసు. (ఇది నాకు గర్వ కారణమని నేను చెప్పటం లేదు) నా పరిధిలో నేను సగ ర్వంగా నిలబడి వున్నాను. ఇక నాకు లోటేమిటి? .... కాకుంటే పెళ్ళికాని దురదృష్టవంతురాలి సంటారు-అవునా?

"మిమ్మల్ని చాలా మార్లు అదృష్టవంతులని అన్నాను. మీరు సంతోషించారామాటకు.

"కానీ, నిజానికి ప్రపంచంలో సంపూర్ణమైన అదృష్టం ఎవరికీ దక్కదేమో !

"శ్రీరాముని ఏక పత్నీవ్రతాన్ని హేళనచేస్తూ - మీ శ్రీవారి మనోనిగ్రహాన్ని మెచ్చుకుంటూ ఎన్నో కబుర్లు చెబు తుంటారు మీరు.... మీ అమాయకత్వం నాకు జాలి కలిగి స్తుంటుంది. అలాటి సమయాలలో ! చూశారా మరి ! మీరు

నా గురించి జాలిపడితే - నేను మీ గురించి జాలి పడు తున్నాను.

"ఇక గోపాలంగారితో నా వివాహం-నాకే ఇష్టంలేదు వివాహమయ్యాక కూడా నా ఉద్యోగం నాకుండాలి. నా ఉద్యోగం గాలూకు డబ్బుతో, నా పుట్టింటివారికి సాయపడ గలగాలి. అందుకు నాకొక్కబోయే భర్త ఏలాటి అభ్యంత రమూ చెప్పకూడదు పది మందితో కలిసిమెలసి తిరుగుతూ సరదాగా వుండే స్వభావం నాది ! .... అందుకు అభ్యంతరం చెబుతూ, అపార్థాలతో నరకం సృష్టించే మొగుణ్ని - మగాణ్ని భర్తగా భరించటం నాతరంకాదు ! అంతకంటే నేనిలా అవివాహితగా వుండిపోయినా నాకే బాధా లేదు.

"ఇక అన్నిటి కంటే ముఖ్యమయిన విషయం _ నేను కొంత కాలం పాటు శెలవు పెట్టి, అక్కణ్నుంచి ట్రాన్స్ఫర్ చేయించుకో బోతున్నాను.

"మీ అమాయకత్వం ఎరగా, ఆకర్షణ సాకుగా తీసు కుని-మీ ఆనందమయ జీవితంలో విషం చిలకరించలేను ! ఏ మగాడూ ఏకపత్నీవ్రతుడు కాదు. అవకాశం అంది రానంతవరకే అన్ని వ్రతాలూను ! అవకాశం అంది వస్తే చాలు-అన్ని వ్రతాలూ గాలికెగిరి పోతాయి చాలా మందికి.

"మీ కుటుంబానికి దూరంగా వుండటమే నే చేయగల సాయం. అదయినా కేవలం మీ మీద నాకు గల ప్రత్యే కాభిమానం వల్లా -జాలి వల్లా....

"ఆఖరుగా నేనూ, ఏ నాడో ఓ నాడు పెళ్ళి చేసేసు

కుంటాడు. ఐతే నాలోనూ ఓ రూపం హత్తుకుపోయి వుంది.

"గుంటకళ్లు, సన్నని మీసకట్టు, నవ్వుతున్నప్పుడు మూసుకుపోయే కళ్లు, మాంఛి పర్సనాలిటి — వుండే వ్యక్తి.... బ్రహ్మచారి.... ఎదురయేంతవరకూ ఆగుతాను.

"మీతో అబద్ధాలాడ లేను. అంచేతే మనసు విప్పి వ్రాస్తున్నాను...."

ఇక వుంటా !

మీ చెల్లెలు
సుజాత

నా కళ్లు నిజంగా తిరుగుతున్నాయి.

("జ్యోతి" మార్చి '72)

—(०)—